
# 17,654 కంపెనీలు బంద్




**గత 10 నెలల్లో మూతబడినట్టు రాజ్యసభలో ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం**


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో దేశవ్యాప్తంగా 17వేలకుపైగా కంపెనీలు మూతబడ్డాయి. మంగళవారం రాజ్యసభలో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష మల్హోత్రా ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానం ప్రకారం.. గత ఏడాది ఏప్రిల్ మొదలు ఈ ఏడాది జనవరి 26 వరకు మొత్తం 17,654 సంస్థలు షట్‌డౌన్ అయ్యాయి. అయితే వీటిలో ఇతర సంస్థల్లో విలీనమైనవి, బడా సంస్థలకు అమ్ముడైనవి, నష్టాలతో చేతులెత్తేసినవి, ఆర్థిక సమస్యలతో మూతబడినవి అన్నీ ఉన్నాయని మంత్రి వివరించారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023-24) 22,044, అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) 84,801 కంపెనీలు బంద్ అయినట్టు తెలుస్తున్నది. మరోవైపు గడిచిన దాదాపు 10 నెలల్లో దేశంలో కంపెనీల చట్టం కింద కొత్తగా 1,38,027 కంపెనీలు నమోదైనట్టు కూడా మంత్రి తెలిపారు. అలాగే 2023-24లో 1,85,318 కంపెనీలు, 2022-23లో 1,59,302 కంపెనీలు నమోదయ్యాయి. ఇకపోతే గత ఐదేండ్లలో దేశంలో 339 విదేశీ కంపెనీలు ఏర్పాటయ్యాయని మల్హోత్రా వెల్లడించారు. ఈ ఏడాదిలో ఏపీ, ఢిల్లీ, కేరళల్లో ఒక్కోటి.. తమిళనాడులో రెండు వచ్చాయన్నారు. నిజానికి 2020 నుంచి భారత్‌లో విదేశీ సంస్థల నమోదు క్రమేణా తగ్గుతున్నట్టు చెప్పారు.

### 82 దర్యాప్తుల్లో నివేదికలు

గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో తీవ్ర మోసాల దర్యాప్తు కార్యాలయం (ఎస్‌ఎఫ్‌ఐవో) 82 దర్యాప్తు నివేదికల్ని సమర్పించినట్టు మంత్రి మల్హోత్రా తెలిపారు. కేవలం గత ఆర్థిక సంవత్సరంలోనే 2023-24 గరిష్ఠంగా 40 రిపోర్టులు వచ్చాయని వివరించారు. అయినప్పటికీ నయాపైసా రికవరీ లేదని స్పష్టం చేశారు. ఇక ఈ మూడేండ్లలోనే ఎస్‌ఎఫ్‌ఐవోకు మరో 26 కేసులను కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అప్పగించినట్టు చెప్పారు. గడిచిన ఐదేండ్లలోనైతే ఈ సంఖ్య 72గా ఉందన్నారు.

### 2,664 విల్‌ఫుల్ డిఫాల్టర్లు

గత ఏడాది మార్చి ఆఖరుకల్లా 2,664 మంది ప్రత్యేక రుణగ్రహీతలను ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులుగా వర్గీకరించినట్టు ఓ లిఖితపూర్వక సమాధానంలో రాజ్యసభకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. వీరిలో వ్యక్తిగత, విదేశీ రుణగ్రహీతలెవరూ లేరని స్పష్టం చేశారు. రుణాలను ఎగ్గొడుతున్నవారిపై కఠిన చర్యలను తీసుకొనేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో కలిసి కేంద్రం పనిచేస్తున్నట్టు వివరించారు.



# 86 వేలకు చేరువలో పుత్తడి

**మరో రూ.500 పెరిగి రూ.85,800కి పదిగ్రాముల ధర**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: బంగారం ధరలు భగభగమండుతున్నాయి. సామాన్యుడికి అందనంత స్థాయికి చేరుకుంటున్న పుత్తడి మరో మైలురాయికి చేరువైంది. వరుసగా ఐదు రోజులుగా పెరుగుతూ వచ్చిన బంగారం ధర మంగళవారం కూడా మరో రూ.500 ఎగబాకి రూ.86 వేలకి చేరువైంది. దేశరాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.500 పెరిగి రూ.85,800 పలికింది. ఆభరణాలు, రిటైలర్ల నుంచి డిమాండ్ అత్యధికంగా ఉండటం వల్లనే ధరలు పెరిగాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. జనవరి 1 నుంచి ఇప్పటి వరకు గోల్డ్ ధర రూ.6,410 లేదా 8 శాతం ఎగబాకి రూ.85,800కి చేరుకున్నది. నెల రోజుల క్రితం ఈ ధర రూ.79,380గా ఉన్నది. గత ఐదురోజులుగా పెరుగుతూ వచ్చిన వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉండటంతో కిలో వెండి రూ.500 తగ్గి రూ.95,500కి పరిమితమైంది. ధరలు తగ్గకముందు ఇది రూ.96 వేలుగా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర రికార్డు స్థాయి 2,872 డాలర్లకు చేరుకున్నది. కెనడా, మెక్సికో దేశాలపై ట్రంప్ విధించిన పన్ను వాయిదాపడటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం ధరలు పెరగడానికి ప్రధాన కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి.

# భయపడి మూసేయలేదు

**కంపెనీ షట్‌డౌన్‌పై హిండెన్‌బర్గ్ అధినేత అండర్సన్**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: అదానీ గ్రూప్ అవకతవకలపై సంచలనాత్మక రిపోర్టుల్నిచ్చిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్.. అనూహ్యంగా మూతబడిన విషయం తెలిసిందే. అయితే ఎవరికీ భయపడి తాను సంస్థను మూసేయలేదని ఈ అమెరికన్ షార్ట్ సెల్లర్ వ్యవస్థాపక అధినేత నాథన్ అండర్సన్ స్పష్టం చేశారు. తమపై లీగల్‌గాగానీ లేక వ్యక్తిగతంగాగానీ ఎవరూ ఏ రకమైన బెదిరింపులకు దిగలేదన్న అండర్సన్.. కేవలం పని ఒత్తిడి కారణంగానే హిండెన్‌బర్గ్ రిసెర్చ్‌ను మూసేసినట్టు పీటీఐకిచ్చిన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అదానీ గ్రూప్ స్టాక్ మార్కెట్లలో అక్రమాలకు పాల్పడిందంటూ 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రిసెర్చ్ ఓ రిపోర్టును విడుదల చేసిన సంగతి విదితమే. దీంతో అదానీ కంపెనీల షేర్లన్నీ ఒక్కసారిగా కుప్పకూలాయి. తీవ్ర నష్టాలను ఎదుర్కొన్నాయి. ఫలితంగా అటు గ్రూప్, అదానీ వ్యక్తిగత సంపద ఏకంగా 150 బిలియన్ డాలర్లకు పైగా కరిగిపోయింది. వ్యాపార-పారిశ్రామిక వర్గాల్లోనేగాక, రాజకీయంగానూ ఇది తీవ్ర దుమారాన్నే రేపింది. ఇక ఈ వ్యవహారంలో సెబీ చీఫ్ మాధవీ పురి బచ్ దంపతుల హస్తం కూడా ఉందని గత ఏడాది ఆగస్టులో మరో బాంబు పేల్చింది. దీంతో పార్లమెంట్‌లోనూ ఆ ప్రకంపనలు కనిపించాయి. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 16న ఆశ్చర్యకరంగా హిండెన్‌బర్గ్ రిసెర్చ్‌ను మూసేస్తున్నట్టు, తమవద్ద అన్ని కేసుల దర్యాప్తులు అయిపోయినట్టు అండర్సన్ చెప్పారు. వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యత ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేశారు. తాజా ఇంటర్వ్యూలోనూ అదే చెప్పారు. 2017లో మొదలైన ఈ కంపెనీ.. 8 ఏండ్లలో అనేక దేశ, విదేశీ కంపెనీలపై సంచలన రిపోర్టుల్నిచ్చింది. ఆ వివరాలను అమెరికా స్టాక్ మార్కెట్ రెగ్యులేటర్లు, దర్యాప్తు ఏజెన్సీలకు పంపింది.

# మళ్లీ 78 వేల పైకి సెన్సెక్స్

**1,400 పాయింట్లు లాభపడ్డ సూచీ • 380 పాయింట్లు ఎగిసిన నిఫ్టీ**



ముంబై, ఫిబ్రవరి 4: దేశీయ స్టాక్ మార్కెట్లు రివ్వున ఎగిశాయి. మెక్సికో, కెనడాలపై విధించిన టారిఫ్‌లను తాత్కాలికంగా వాయిదావేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ప్రకటించడంతో అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా పుంజుకున్నాయి. ఇదే క్రమంలో గత కొన్ని రోజులుగా నష్టాలు ఏరులైపారుతున్న దేశీయ మార్కెట్లు కదంతొక్కాయి. మదుపరులుగు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ ఇంట్రాడేలో 1,472 పాయింట్లు లేదా 2 శాతం వరకు లాభపడింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 1,397.07 పాయింట్లు లేదా 1.81 శాతం అందుకొని 78,584.81 పాయింట్ల వద్దముగిసింది. దీంతో సూచీలు నెల గరిష్ఠ స్థాయికి చేరుకున్నట్లు అయింది. మరోసూచీ నిఫ్టీ సైతం 378.20 పాయింట్లు లేదా 1.62 శాతం అందుకొని 23,739.25 వద్ద ముగిసింది. జనవరి 3 తర్వాత సూచీలకు ఇదే గరిష్ఠ స్థాయి ముగింపు కావడం విశేషం. రిజర్వుబ్యాంక్ తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం కూడా మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. దీంతో 6 లక్షల కోట్ల మదుపరుల సంపద పెరిగింది. బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.5,95,996.51 కోట్లు పెరిగి రూ.4,25,50,826.11 కోట్లు(4.88 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. వాణిజ్య యుద్ధానికి తెరలేపిన ట్రంప్..ఇతర దేశాల నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో రెండు దేశాలపై విధించిన టారిఫ్ విషయంలో వెనక్కి తగ్గడం సూచీల్లో జోష్ పెంచిందని మోతీలాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ సిద్దార్ధ తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌పై మదుపరులు వేచి చూసే దోరణి అవలంబించినప్పటికీ గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలు పెరగడానికి ప్రధాన కారణం.

- ఎల్‌అండ్‌టీ 4.76 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- అదానీ పోర్ట్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా మోటర్స్, రిలయన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఏషియన్ పెయింట్, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, కొటక్ బ్యాంక్, ఎస్బీఐ, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్, టాటా స్టీల్, మహీంద్రా, ఎయిర్‌టెల్, టైటాన్, ఐటీసీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- ఐటీసీ హోటల్స్, జొమాటో, నెస్లె, మారుతి, హెచ్‌యూఎల్ షేర్లు నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే క్యాపిటల్ గూడ్స్ 3.42 శాతం, ఇండస్ట్రీయల్స్ 2.59 శాతం, ఎనర్జీ 2.50 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 2.40 శాతం, పవర్ 2.31 శాతం, ఆర్థిక సేవలు 2 శాతం చొప్పున లాభపడ్డాయి. కానీ, ఎఫ్‌ఎంసీజీ రంగ షేర్లు పతనం చెందాయి.

# టాటా కార్లపై భారీ డిస్కౌంట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఎంపిక చేసిన మోడళ్లపై టాటా మోటర్స్ తాజాగా లక్ష రూపాయల వరకు తగ్గింపు ప్రకటించింది. వీటిలో టియాగో, టిగోర్, ఆల్ట్రోజ్, పంచ్, నెక్సాన్, హరియర్, సఫారీ మాడళ్లున్నాయి. పెట్రోల్/సీఎన్‌జీ రకాల విషయానికొస్తే.. టియాగో మాడల్‌పై రూ.35 వేలు రాయితీ ఇస్తున్నది. రూ.20 వేలు కన్స్యూమర్ డిస్కౌంట్, మరో రూ.15 వేలు ఎక్స్ఛేంజ్ డిస్కౌంట్‌లున్నాయి. ఇలాగే టిగోర్‌పై రూ.45 వేలు, ఆల్ట్రోజ్‌లో రేసర్ మినహా మిగతా వేరియంట్లపై రూ.65 వేలు, పంచ్‌పై రూ.25 వేలు, నెక్సాన్ మాడళ్లపై రూ.45 వేల రాయితీలున్నాయి. ఇక ఎస్‌యూవీ మాడళ్లైన హరియర్, సఫారీ అన్ని డీజిల్ వేరియంట్లపై రూ.75 వేల వరకు డిస్కౌంట్ వస్తున్నది. మరోవైపు, ఆల్ట్రోజ్, నెక్సాన్ డీజిల్ అన్ని రకాలపై 65వేలు, 45వేల చొప్పున డిస్కౌంట్‌లున్నాయి. అయితే ఆల్ట్రోజ్ పెట్రోల్ రేసర్ వేరియంట్‌పై గరిష్ఠంగా లక్ష డిస్కౌంట్ ఉన్నది. జనవరిలోనూ కంపెనీ రూ.85 వేల తగ్గింపునిచ్చినది తెలిసిందే.

# ఎన్‌ఎస్‌ఈ లాభం 3,834 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దేశంలో అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్‌ఎస్‌ఈ విశ్లేషకుల అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.3,834 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.1,975 కోట్ల లాభంతో పోలిస్తే 94 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో ఆదాయం ఏడాది ప్రాతిపదికన 21 శాతం ఎగబాకి రూ.3,974 కోట్ల నుంచి రూ.4,807 కోట్లకు చేరుకున్నది. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల్లో రూ. 45,499 కోట్ల ఆదాయంపై రూ.14,780 కోట్ల నికర లాభాన్ని గడించింది.

# హీరోకు 456 కోట్ల జీఎస్టీ నోటీసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దేశీయ ఆటోరంగ దిగ్గజం, ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్‌కు రూ.456.06 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసు వచ్చింది. రాజస్థాన్‌లోని అల్వార్ సెంట్రల్ జీఎస్టీ అదనపు కమిషనర్ నుంచి ఈ తాఖీదులు అందాయి. 2017 జూలై నుంచి 2024 మార్చి వరకు సరఫరా జరిగిన వాహన విడిభాగాలు, ఇతరత్రా వాటి ధరలకు సంబంధించిన వ్యవహారంలో ఈ నోటీసులు జారీ అయ్యాయి. మరోవైపు ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీకి కూడా రూ.101. 95 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసు వచ్చింది. గత ఐదు ఆర్థిక సంవత్సరాలకుగాను ఆయా రాష్ర్టాల్లో జీఎస్టీ షార్ట్ పేమెంట్లకు సంబంధించి ఈ నోటీసు విడుదలైందని మంగళవారం ఎల్ఐసీ తెలిపింది. కాగా, త్వరలో జీఎస్టీ శ్లాబులు, రేట్లపై జీఎస్టీ కౌన్సిల్ ఓ నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలియజేశారు.

## చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

రేగొండ, ఫిబ్రవరి 4 : చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మత్స్యకారుడు మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మడుత్తపల్లి (కాకర్లపల్లె) గ్రామానికి చెందిన మత్స్యకారుడు బోళ్ల మల్లయ్య (60) మంగళవారం మధ్యాహ్నం చేపల వేట కోసం గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లాడు. ఈ సమయంలో చేపల కోసం వేసిన వలలో మల్లయ్య పడి అందులో మునిగి మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని చెరువు నుంచి వెలికితీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**గాయపడిన వ్యక్తి..**

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. ములుగు జిల్లా పాపయ్యపల్లెకు చెందిన ఇజ్జిరి దేవేందర్ (30) పది రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై చిట్యాల మండలకేంద్రానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రేగొండ మండలం లింగాల క్రాస్ వద్ద బైక్ అదుపుతప్పి కింద పడగా గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


## నులిపురుగులను నిర్మూలిద్దాం.

**భూపాలపల్లి డీఎంహెచ్‌వో మధుసూదన్**

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 4 : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి మధుసూదన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్లు, సూపర్‌వైజర్లతో నులిపురుగుల నివారణపై ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 1 నుంచి 19 ఏండ్లు గల ప్రతి ఒక్కరికి నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు మాత్రలు పంపిణీ చేయాలని, ఫిబ్రవరి 10న అటెండెన్స్ సమయంలో విద్యార్థులకు మాత్రలు వేయాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైతం మాత్రలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లు , సూపర్‌వైజర్లు, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## అధ్యాపకురాలికి సన్మానం

మహదేవపూర్, ఫిబ్రవరి 4 : మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న డాక్టర్ మాధవి 'ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో యాజమాన్య చలనాలు' అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఈ నేపథ్యంలో ఆమెను ప్రిన్సిపాల్ జన్ను విజయ్‌కుమార్, అధ్యాపకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రాజు, డాక్టర్ శ్రీనివాస్, మున్నయ్య పాల్గొన్నారు.




మాధవిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు

## గొంతమ్మ గుట్ట జాతరను విజయవంతం చేయాలి

కాటారం, ఫిబ్రవరి 4 : మండలంలోని ప్రతాపగిరి గుట్టపై ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగే గొంతెమ్మ గుట్ట జాతరను విజయవంతం చేయాలని ప్రతాపగిరి నాయకపోడు ఆలయ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం గుట్టపై జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు జరిగే జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బీసుల రవీందర్, ఎర్రయ్య, మేకల పోచయ్య, సంతోష్, గుంటి రాజేందర్, కొయ్యల మధూకర్, సంపత్, మధునక్క, పోషక్క పాల్గొన్నారు.


# కుంభాభిషేకం మహోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

- **5నుంచి పారిశుధ్య పనులు ప్రారంభించాలి**
- **భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 4 : కాళేశ్వరంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న కుంభాభిషేకం మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక స్వీపర్లను నియమించి ప్రతిరోజూ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 5వ తేదీ నుంచి పనులు ప్రారంభించాలన్నారు. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని సూచించారు. 7 నుంచి 9వ తేదీ వరకు అత్యవసర వైద్య సేవల నిమిత్తం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి, దేవస్థాన ప్రాంగణంలో ఆర్‌వో వాటర్ డ్రమ్ములు ఏర్పాటు చేయాలని, ఆలయ వెనుక భాగంలో మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. 9వ తేదీ ఉదయం 10:42 గంటలకు కుంభాభిషేకం చేసేందుకు పీఠాధిపతులు, వేద పండితులు, వీఐపీలు గోపురాలపైకి, ప్రధాన దేవాలయాలపైకి వెళ్లాల్సి ఉన్నదని, ఆ సమయంలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా పోలీస్ శాఖ ప్రత్యేక బందోబస్తు నిర్వహించాలని సూచించారు. మత్స్య శాఖ అధికారులు గోదావరి వద్ద 10 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని, ప్రమాదకరమైన స్థలాలను గుర్తించి హెచ్చరికల జెండాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అగ్నిమాపక వాహనం ద్వారా నీటితో ఆలయ నాలుగు గోపురాలను శుద్ధి చేయాలన్నారు. భక్తులకు అన్నదానం, విధుల్లో ఉన్న సిబ్బందికి, వలంటీర్లకు భోజన, వసతి సౌకర్యాలు కల్పించాలని దేవాలయ అధికారులను ఆదేశించారు. అదనపు అర్చక సిబ్బందిని ఏర్పాటు చేయాలని, పీఠాధిపతులను ఆహ్వానించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఏఎస్పీ బోనాల కిషన్, డీపీవో నారాయణరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్చూర్ నాయక్, జిల్లా వైద్యాధికారి మధుసూదన్, డీపీఆర్‌వో శ్రీనివాస్, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్ నుంచి దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, కమిషనర్ శ్రీధర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. కాళేశ్వరంలో ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.




నీటి పంపింగ్ నిలిపివేయడంతో చేపలు పడుతున్న గ్రామస్తులు

# దేవాదుల పైప్‌లైన్ వద్ద చేపల వేట

వెంకటాపూర్, ఫిబ్రవరి 4: పాలంపేటలోని రామప్ప చెరువులోని దేవాదుల పైప్‌లైన్ వద్ద మంగళవారం చేపలు పట్టడానికి గ్రామస్తులు ఎగబడ్డారు. గత కొన్ని రోజులుగా రామప్ప చెరువులోకి దేవాదుల నీటిని పంపింగ్ చేస్తున్న నీటిపారుదలశాఖ అధికారులు మంగళవారం మోటార్లను నిలిపి వేశారు. దీంతో రామప్ప చెరువు సమీపంలో పైపుల వద్ద ఉన్న కొద్దిపాటి నీటిలో చేపలు ఎగురుతుండటం చూసిన స్థానికులు వలలు, దోమతెరలతో చేపల వేట కొనసాగించారు. అక్కడికి వెళ్లిన అందరికి చేపలు దొరకడంతో సంతోషంగా వెనుదిరిగారు.

## మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన పీఏసీఎస్ చైర్మన్

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 4 : మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను మంగళవారం జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట అఖిల భారత యాదవ సంఘం జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు నలిగేటి సతీశ్ యాదవ్, టిప్పర్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్ట రవీందర్ యాదవ్ ఉన్నారు.



కమిషనర్‌ను సన్మానిస్తున్న సంపత్‌కుమార్

## ఇన్‌చార్జి సీడీపీవో ఆత్మహత్యాయత్నం

**పూర్తి విచారణ చేయకుండానే సస్పెండ్ చేశారని మనస్తాపం**



విలపిస్తున్న ధనలక్ష్మి

ములుగురూరల్/వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 4: వెంకటాపురం(నూగూరు) మండలంలోని ఇన్‌చార్జి సీడీపీవో మంగళవారం ఆత్మహత్యాయత్నం చేసింది. పూర్తి విచారణ చేయకుండానే సస్పెండ్ చేశారని కత్తితో చేయి కోసుకుంది. ఈ విషయం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. వివరాలిలా ఉన్నాయి.. ఆదిలాబాద్ జిల్లాలో పనిచేసిన ధనలక్ష్మి మూడు నెలల క్రితం బదిలీపై వెంకటాపురానికి రాగా, అక్కడ అంగన్‌వాడీ టీచర్లతో వాగ్వాదం జరిగింది. దీంతో వారు ఈ నెల 1వ తేదీన ఇన్‌చార్జి సీడీపీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అదే రోజు ఆమె కలెక్టర్‌కు వివరణ ఇవ్వగా, ఫిర్యాదుతో పాటు సీడీపీవో తెలిపిన వివరాలపై ఒక కమిటీని వేసి విచారణకు ఆదేశిస్తామని తెలిపినట్లు సమాచారం. అక్కడి నుంచి ధనలక్ష్మి వచ్చిన అరగంట లోపు ఈ ఆఫీసర్ పోర్టల్ ద్వారా సీడీపీవోను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. వాటిపై కలెక్టర్ డిజిటల్ సంతకం ఉండగా, స్టాంప్ లేకపోవడం, డీడబ్ల్యూవో స్టాంప్ ఉండడం చర్చనీయాంశంగా మారింది. కమిటీ వేసిన అనంతరం విచారణ జరగకముందే తనను సస్పెండ్ చేయడం అన్యాయమని, పూర్తి విచారణ లేనిది తనను ఎలా సస్పెండ్ చేస్తారంటూ ఇన్‌చార్జి సీడీపీవో ధనలక్ష్మి తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం వెంకటాపురంలోని ఇంట్లో కత్తితో చేయి కోసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. డ్రైవర్ చూసి దవాఖానకు తరలించాడు. తనను డీడబ్ల్యూవో కావాలని సస్పెండ్ చేయించిందని దవాఖానలో ధనలక్ష్మి కన్నీరు మున్నీరుగా విలపించింది. సీడీపీవో ధనలక్ష్మి కోలుకుంటున్నట్లు వైద్యుడు సూర్యతేజ ఒక ప్రకటనలో తెలిపారు. ధమనులు, నరాలు లేదా కండరాలకు ఎటువంటి హాని కాలే దని, ఆమె ఆరోగ్యం క్షేమంగా ఉందని తెలిపారు. కాగా, ములుగు ఇన్‌చార్జి డీడబ్ల్యూవో శిరీష మాట్లాడుతూ సీడీపీవో సస్పెండ్ విషయంలో నా ప్రమేయం లేదన్నారు. ఈ విషయంలో నా తప్పు ఉన్నట్లు తేలితే నేను జాబ్‌కు రిజైన్ చేస్తానని చెప్పారు. ప్రస్తుతం విచారణాధికారులుగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీఎస్‌వో సర్దార్‌సింగ్‌ను కలెక్టర్ నియమించారు. 15రోజుల్లో విచారణ పూర్తవుతుందని తెలిపారు.

**డీడబ్ల్యూవో నన్ను టార్గెట్ చేసింది : ఇన్‌చార్జి సీడీపీవో ధనలక్ష్మి**

సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు ఇలా చేస్తున్నారని డీడబ్ల్యూవోకు ముందే చెప్పిన. సెంటర్ విజిట్లు ఎందుకు చేస్తున్నామని కూడా నాపై ఒత్తిడి తెచ్చారు. ఏఐటీయూసీ వాళ్లకు చెప్పి ఏడిపించిన్రు. సారీ అమ్మ అని చెప్పిన, నేను సెంటర్ విజిట్ చేయను.. నన్ను క్షమించమని చెప్పినా వినలేదు. అందరూ కలిసి కలెక్టర్ దగ్గరికి వెళ్లి వాళ్లను తిట్టానని, సెంటర్లపై అడిగానని, పేపర్ వాళ్లకు న్యూస్ ఇచ్చానని, తప్పుడు స్టేట్‌మెంట్లు ఇచ్చి డీడబ్ల్యూవో నన్ను సస్పెండ్ చేయించారు. అధికారులు న్యాయం చేయాలి.

## ఏజెన్సీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

వాజేడు, ఫిబ్రవరి 4 : ఏజెన్సీ చట్టాలైన 1/70, పెసా, ఎల్‌టీఆర్ చట్టాలను అధికారులు పటిష్టంగా ఆమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు టింగ బుచ్చయ్య డిమాండ్ చేశారు. మండలంలోని చింతూరు గ్రామపంచాయతీలోని లక్ష్మీపురం గ్రామంలో నిర్వహించిన ఆదివాసీ సంక్షేమపరిషత్ నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు లొడిగ నరసింహారావు, సుధాకర్, పగిడయ్య, సంతోష్, శ్రీకాంత్, నవీన్ పాల్గొన్నారు.

## నేడు రాజకీయ నాయకులతో సమావేశం

గణపురం, ఫిబ్రవరి 4 : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నేడు వివిధ రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులు వారి ప్రతినిధులతో సమీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎల్ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రూపొందించిన సప్లమెంటరీ-2, డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై ఉదయం 11:30 గంటలకు వారితో చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశానికి మండలంలోని నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మహదేవపూర్ (కాళేశ్వరం), ఫిబ్రవరి 4 : మహదేవపూర్, కాళేశ్వరం, పెద్దంపేట, సూరారం గ్రామాల సబ్ స్టేషన్లలో 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో నేడు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ అధికారి శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహరించాలని కోరారు.

## సీసీపీఎల్ అధ్యక్షుడిగా వినయ్

చిట్యాల, ఫిబ్రవరి 4 : మండలకేంద్రంలో నిర్వహించే సీసీపీఎల్ క్రికెట్ లీగ్ అధ్యక్షుడిగా ఇరుకులపాటి వినయ్‌ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆకుల హరీశ్, ప్రధాన కార్యదర్శిగా మాటూరి లవన్‌బాబు, ఉపాధ్యక్షులుగా బైరం శివ, గడ్డం, సాయి నితిన్, కోశాధికారిగా వేల్పుల రాజ్‌కుమార్, ప్రచార కార్యదర్శులుగా చిలుముల శ్రీనివాస్, సరిగొమ్ముల అజయ్ నియమితులయ్యారు. వినయ్ మాట్లాడుతూ త్వరలోనే క్రికెట్ క్రీడా విధానాలను రూపొందించి, రిజిస్ట్రేషన్లను ప్రారంభిస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించే క్రికెట్ క్రీడా పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలి

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 4 : మండలానికి కేటాయించిన అంబులెన్స్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 108 జిల్లా మేనేజర్ నరేశ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలకు 108, 102 నియంటల్, ఎఫ్ హెచ్ ఎస్ సర్వీస్‌లపై అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధి నిర్మూలనపై వైద్య సిబ్బందితో వైద్యాధికారి నాగరాణి ప్రతిజ్ఞ చేయించారు. 108 సిబ్బంది కటుకూరి శ్రీనివాస్, బండి సురేశ్, శీలపాక రాజు, సాగర్ పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్

ములుగురూరల్, ఫిబ్రవరి 4 : జంగాలపల్లి గ్రామంలో మంగళవారం పోలీసులు ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ప్రమాదాల నివాణకు జాతీయ రహదారి డివైడర్ మధ్యలో అమర్చిన ఇనుప భారీ కేడింగ్, చెట్లను తొలగించారు. అనంతరం ప్రజలకు డ్రంక్‌అండ్‌డ్రైవ్, ఓవర్ స్పీడ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఇతర ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 4 : మండలంలోని వేములపల్లి పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై బీ అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరికోల్, కౌకొండ గ్రామాలకు చెందిన దొగ్గెల జస్వంత్, మేకల కార్తీక్, దొగ్గెల వీరన్న, గడ్డం కిరణ్ కొంత కాలంగా వేములపల్లి పెద్దవాగు నుం చి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్నారు. మంగళవారం వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## 150 లీటర్ల గుడుంబా స్వాధీనం

వాజేడు, ఫిబ్రవరి 4 : మండలంలోని అయ్యవారిపేట గ్రామంలో మంగళవారం పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహించారు. జనగం వెంకటరమణ ఇంట్లో తనిఖీ చేయగా 150లీటర్ల గుడుంబా లభించడంతో స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సైతో పాటు హెడ్‌కానిస్టేబుల్ సంతోష్, కానిస్టేబుళ్లు సత్యాన్వేష్, నరేశ్ పాల్గొన్నారు.